టూరిజం కల నెరవేరేనా?

- మత్తడి చెరువు అభివృద్ధిపై దృష్టి సారించని అధికారులు
- పర్యాటకులకు కనీస వసతులు కరువు
- అభివృద్ధి చేయాలని కోరుతున్న ప్రజలు



కనువిందు చేస్తున్న మత్తడి చెరువు అందాలు



మత్తడిపై నుంచి పారుతున్న వరద (ఫైల్)

ఉట్నూర్‌రూరల్: ఏజెన్సీలో పేరుగాంచిన మత్తడి చెరువు పర్యాటకుల మదిని దోచుకున్నా.. అభివృద్ధికి దూరంగా ఉంది. ప్రతీ ఏడాది పర్యాటకులు పెద్ద ఎత్తున వస్తున్నప్పటికీ ప్రభుత్వం కనీస వసతులు కల్పించడం లేదు. ఏజెన్సీ డివిజన్ కేంద్రం లక్కారం పరిధిలో వచ్చే చెరువు అందాలు అందరి మదిని దోచుకుంటున్నప్పటికీ నిర్లక్ష్యం నీడలో కొట్టుమిట్టాడుతోంది. లక్కారం నుంచి 3 కిలో మీటర్లు వెళ్తే ఈ చెరువు అందాలను వీక్షించవచ్చు. చెరువును టూరిజం స్పాట్‌గా ఏర్పాటు చేసే దిశగా అధికారులు పలుమార్లు పర్యటించారు. అయినా.. ఎలాంటి అభివృద్ధి చేయలేదు. గుట్టల మధ్య పచ్చని చెట్లతో చెరువు వద్దకు వచ్చే పర్యాటకుల మదిని దోచుకుంటుంది. సెలవు దినాల్లో పాఠశాల విద్యార్థులు, పర్యాటకులు అధికసంఖ్యలో వస్తుంటారు. ఇక్కడికి వచ్చేందుకు రోడ్డు సౌకర్యం కూడా లేదు. దీంతో పర్యాటకులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

మదినిదోచే వాతావరణం..

లక్కారం పంచాయతీ పరిధిలో గల మత్తడి చెరువు సందర్శకుల మదిని దోచుకుంటోంది. విశాలమైన చెరువు.. చుట్టూ ఎతైన కొండలు మత్తడి నుంచి పారుతున్న నీటి పరవళ్లతో కనువిందు చేస్తోంది. ఈ ప్రాంతం పర్యాటకులతో సందడిగా మారుతోంది. ఈ చెరువుకు చేరుకోవాలంటే సరైన రహదారి సౌకర్యం లేక పోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. టూరిజం ఏర్పాటు కోసం అప్పటి కలెక్టర్ వెంకటేశ్వర్లు, టూరిజం అధికారులు ఈ ప్రాంతాన్ని పరిశీలించారు. ఆ తరువాత అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మత్తడి చెరువు ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

పర్యాటకంగా అభివృద్ధి చేయాలి



మత్తడి చెరువును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి. గతంలో జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు మత్తడి చెరువును టూరిజం కేంద్రంగా ఏర్పాటు చేస్తామని ఈప్రాంతాన్ని పరిశీలించడం జరిగింది. అదే విధంగా టూరిజం అధికారులు సందర్శించి నివేదికలు తయారు చేశారు. అయినా నేటి వరకు ఎలాంటి దృష్టి పెట్టలేదు. – పుర్క బాపురావు, తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి

గిరిజనులకు ఉపాధి



మత్తడి చెరువును టూరిజం కేంద్రంగా అభివృద్ధి చేస్తే గిరిజనులకు ఉపాధి దొరుకుతుంది. డివిజన్ కేంద్రంలో కాలక్షేపం కోసం ఇలాంటి ప్రదేశాలు ఎక్కడా లేకపోవడంతో ప్రజలు ఇక్కడికి వస్తుంటారు. ఇక్కడి వాతావరణం, ప్రదేశాలు కూడా చూపరులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. – మర్సుకోల తిరుపతి, మాజీ సర్పంచ్, లక్కారం

చదువుతోనే సమాజంలో గుర్తింపు



మాట్లాడుతున్న జడ్జి దుర్గారాణి

ఉట్నూర్‌రూరల్: విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదివి ముందుకెళ్లాలని ఉట్నూర్ సివిల్ కోర్టు జడ్జి దుర్గారాణి అన్నారు. శుక్రవారం కేజీబీవీ పాఠశాల విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. విద్యార్థినులు బాగా చదువుకొని భవిష్యత్‌లో మంచి స్థానంలో ఉండాలన్నారు. తల్లిదండ్రులు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయవద్దన్నారు. కార్యక్రమంలో ఉట్నూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పెందూర్ ప్రభాకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చట్టాల గురించి తెలుసుకోవాలి

తాంసి: ప్రతిఒకరూ చట్టాల గురించి తెలుసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి క్షమా దేశ్‌పాండే అన్నారు. శుక్రవారం భీంపూర్ మండలంలోని అర్లి(టి) గ్రామంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. గ్రామస్తులకు వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. రాజీమార్గంతో కేసులు సులువుగా పరిష్కరం అవుతాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గోల్లి రమ, పంచాయతీ కార్యదర్శి రవికాంత్, ఉల్లాస్ పటేల్, వైభవ్, రాకేశ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కుటుంబమే అభివృద్ధి చెందింది

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్



మాట్లాడుతున్న పాయల్ శంకర్

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే కుటుంబమే అభివృద్ధి చెందిందని, పట్టణంలోని ప్రజలు మురికివాడల్లో దుర్భర జీవితం గడుపుతున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ పట్టణంలోని వార్డ్ నం 25 పంజేషా కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములను కబ్జాలు చేసుకునే వారికి వెంటనే పట్టాలు అందిస్తారు, కానీ అర్హులైన పేదలకు పట్టాలు ఇవ్వకుండా ఇబ్బందికి గురిచేస్తున్నారని ఆరోపించాఉ. నరేంద్ర మోదీ పాలనలో బీజేపీ పాలిత రాష్ట్రాలు వంద శాతం అభివృద్ధి పథంలో ప్రయనిస్తున్నాయన్నారు. నాయకులు లాలా మున్న, రాజేశ్, ఆకుల ప్రవీణ్. జోగు రవి, విజయ్, చిలుకూరి జ్యోతిరెడ్డి, రాము, ముకుంద్, వేణు పాల్గొన్నారు.

‘వసతుల కల్పనలో బీఆర్‌ఎస్ విఫలం’

ఇచ్చోడ: గిరిజన గురుకుల పాఠశాల్లో విద్యార్థులకు వసతులు కల్పించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుహాసినిరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలికల పాఠశాలను సందర్శించారు. సరిపడా మరుగుదొడ్లు లేక విద్యార్థినులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే గిరిజన విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. పాఠశాల ఎదుట ఉన్న జాతీయ రహదారిపై రాస్తారోకో చేసేందుకు ప్రయత్నించగా పోలీసులు ఆమెను అరెస్టు చేసి, పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కేంద్రే నారాయణ, సోషల్ మీడియా కన్వీనర్ జాదవ్ రాము, తదితరులు పాల్గొన్నారు.

పీఓను కలిసిన సుహాసిని రెడ్డి

ఉట్నూర్‌రూరల్: ఇటీవల ఐటీడీఏ పీవోగా బాధ్యతలు చేపట్టిన చాహత్ బాజ్‌పాయ్‌ను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుహాసిని రెడ్డి, జాతీయ నాయకులు శ్రీరామ్ నాయక్‌లు మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లాలోని గిరిజన వసతి గృహాలు, పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు, రిమ్స్ ఆసుపత్రిలో గిరిజనుల కోసం ఐటీడీఏ ద్వారా ప్రత్యేక విభాగం కేటాయించి, అంబులెన్స్ ఏర్పాటు చేయాలని వినతిపత్రం సమర్పించారు. కొండేరి రమేశ్, మరప రాజు, శివకుమార్, క్రాంతి కుమార్, శ్రీకాంత్, రాజలింగు పాల్గొన్నారు.

గోరింటాకు సందడి



ఆదిలాబాద్‌టౌన్: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని ఆదిలాబాద్ పట్టణంలోని ఉమా మహేశ్వర ఆలయంలో మహిళలు గోరింటాకు పెట్టుకున్నారు. శుక్రవారం సామూహిక గోరింటాకు కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలు మాట్లాడుతూ.. ప్రకృతిలో వచ్చే మార్పులను అనుసరించి పండుగలను నిర్వహించుకోవడం మన సంస్కృతి, సాంప్రదాయమన్నారు. ఆయుర్వేద శాస్త్రం ప్రకారం గోరింటాకులో వేడిని తగ్గించే శక్తి ఉందని, మహిళలు సౌందర్యానికి, సౌభాగ్యానికి సూచికగా గోరింటాకు పెట్టుకుంటారని తెలిపారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని భుక్తాపూర్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ సదానందం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు భుక్తపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని భుక్తాపూర్, సినిమా రోడ్, మోచిగల్లి, ద్వారకానగర్, విద్యానగర్ ప్రాంతాల్లో సరఫరా నిలిపివేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

ఘనంగా బోనాల పండుగ

ఆదిలాబాద్‌టౌన్: తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు అద్దం పట్టే బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న సతీమణి జోగు రమ ఆదిలాబాద్ పట్టణంలోని పలు ఆలయాలను సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా అశోక్ రోడ్‌లోని పోచమ్మ తల్లి ఆలయంలో బోనం సమర్పించారు. మహాలక్ష్మివాడలోని ఆలయంలో బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని, పాడి పంటలు సమృద్ధిగా పండాలని మొక్కుకున్నారు.

‘బీఆర్‌ఎస్ హయాంలోనే అభివృద్ధి’

ఉట్నూర్‌రూరల్: బీఆర్‌ఎస్ హయాంలోనే రాష్ట్రం అభివృద్ధి చెందిందని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని పులిమడుగు, సాకెర(బి), జైత్రాంతండా గ్రామాల్లో పర్యటించారు. గ్రామస్తులు సమస్యలు ఆమె దృష్టికి తీసుకురాగా.. స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులను పిలిచి, వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం యేంద గ్రామానికి చెందిన ముకుంద్ సోదరుడు అనారోగ్యానికి గురై ఇంటి వద్ద ఉండగా.. వారిని పరామర్శించారు. కార్యక్రమంలో ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీరామ్, వైస్ ఎంపీపీ బాలాజీ, అజీం, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలి

ఆదిలాబాద్‌టౌన్: కాంగ్రెస్ బలోపేతానికి ప్రతీ కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ అన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని బంగారుగూడ కాలనీకి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు సయ్యద్ మహబూబ్ అలీ కాంగ్రెస్ చేరగా.. శుక్రవారం కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఖాడే సంతోశ్, పట్టణ అధ్యక్షుడు గుడిపెల్లి నగేశ్, కాంగ్రెస్ మైనార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ అఫ్రోజ్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్: ప్రభుత్వరంగ సంస్థల ద్వారా కల్పిస్తున్న ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని భాగ్యనగర్‌లో న్యాక్ ద్వారా మహిళలకు మూడు నెలల పాటు ఉచిత శిక్షణ అందించగా.. శుక్రవారం మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. స్వయం ఉపాధి అవకాశాలు పెంచుకొని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని, కౌన్సిలర్ అశోక్, స్వామి పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల నిరసన

ఆదిలాబాద్‌టౌన్: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మధ్యాహ్న భోజన కార్మికులు శుక్రవారం డీఈవో కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం డీఈవో ప్రణీతకు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

అవగాహన కల్పించాలి

ఆదిలాబాద్‌రూరల్: వర్షాకాలంలో సోకే సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఉట్నూర్ గిరిజన వైద్యాధికారి కుమ్రం బాలు అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని అంకోలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ముందుగా రికార్డులను పరిశీలించారు. వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజలకు వివరించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఆయన వెంట వైద్య సిబ్బంది గంగామణి, ద్రుపతి, సురేశ్, మౌనిక, తులసీదాస్, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు సర్టిఫికెట్లు పంపిణీ

ఇంద్రవెల్లి: మండలంలోని హీరాపూర్ గ్రామంలో హెల్ప్ వీల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కుట్టు మిషన్ శిక్షణ తీసుకున్న యువతులు, మహిళలకు శుక్రవారం సంస్థ నిర్వాహకులు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. గ్రామీణ ప్రాంతంలోని మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్ శిక్షణ ఇచ్చి, ఆర్థికాభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందని ఫౌండేషన్ వ్యవస్థపకుడు అతిష్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో హీరాపూర్ గ్రామస్తులు పాల్గొన్నారు.

అన్నిరంగాల్లో పట్టణం అభివృద్ధి

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ విశ్రాంతి భవనం వద్ద ఏర్పాటు చేస్తున్న భారీ జాతీయ పతాక నిర్మాణ పనులను శుక్రవారం పరిశీలించారు. ఎన్‌డీటీ డేటా కంపనీ సీఎస్సార్ నిధులతో 150 అడుగుల భారీ జాతీయ జెండాను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆయన వెంట వాగ్మారే ప్రశాంత్, కంపెనీ ప్రతినిధులు ఉన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కైలాస్‌నగర్: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఆదిలాబాద్ మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని 19వ వార్డు పరిధిలో గల గాంధీనగర్‌లో శుక్రవారం విస్తృతంగా పర్యటించారు. శానిటేషన్ డ్రైవ్‌లో భాగంగా కాలినడకన తిరుగుతూ ప్రజలకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట కౌన్సిలర్ మంగళ రామేశ్వర్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేందర్, నల్ల మహేందర్, వార్డు యూత్ అధ్యక్షుడు అజయ్, షేక్ అన్సార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

బేల: మండలంలోని సైద్‌పూర్ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం అడిషనల్ డీఎంహెచ్‌వో బాలు తనిఖీ చేశారు. పరిసరాలతో పాటు పలు రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలోని గ్రామాల్లోని ర్యాపిడ్ సర్వే, గర్భిణుల గుర్తింపు, ఇమ్యూనైజేషన్, రక్తహీనత నివారణ, తదితర వాటిపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి స్వామి పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన

ఉట్నూర్‌రూరల్: సీపీఆర్‌పై అంగన్‌వాడీ కార్యకర్తలకు శుక్రవారం అవగాహన కల్పించారు. శుక్రవారం ఉట్నూర్ పీఎంఆర్సీ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ఆరోగ్య శిక్షణాధికారి మనోహర్ పాల్గొన్నారు. ఒక వ్యక్తి గుండెపోటుకు గురై అపస్మారక స్థితిలోకి వెళ్లినప్పుడు వెంటనే సీపీఆర్ విధానం ద్వారా వ్యక్తిని బతికించవచ్చన్నారు. కార్యక్రమంలో హరీశ్, శిరీషా, నివేదిత, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఐసీడీఎస్ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

తాంసి: విద్యార్థుల ఆరోగ్యంపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని మండల వైద్యాధికారి శ్రావ్య అన్నారు. శుక్రవారం మండలంలోని కప్పర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా తాంసి, భీంపూర్ మండలాల్లోని వివిధ పాఠశాలల హెచ్‌ఎంలకు అవగాహన కల్పించారు. విద్యార్థుల్లో పౌష్టికాహార లోపం, వ్యాధుల నివారణ, ఆరోగ్య పరిరక్షణ విషయాల గురించి చర్చించారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీకాంత్, భీంపూర్ వైద్యాధికారి నిఖిల్ రాజ్, హెచ్‌ఈవో జ్ఞానేశ్వర్, హెచ్‌ఎంలు శిల్ప, రాజేశ్వర్ రెడ్డి, కిష్టన్న, రాజశేఖర్ పాల్గొన్నారు.

పత్తి, సోయాలో ఆకుమచ్చ తెగులు

బోథ్: మండలంలోని సొనాల గ్రామంలో శుక్రవారం వ్యవసాయాధికారులు పర్యటించారు. పత్తి, సోయా పంటలకు ఆకుమచ్చ తెగులు సోకినట్లు నిర్ధారించారు. 20 నుంచి 30 రోజుల పంటలో తెగులు నివారణ చర్యలు తీసుకోవాలని ఏవో విశ్వమిత్ర తెలిపారు. పత్తిలో ఆకుమచ్చ తెగులు నివారణకు కార్బండజిమ్, మాంకోజెబ్ 2 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. బ్యాక్టీరియా తెగులు నివారణకు, ఎండు తెగులు నివారణకు లీటరు నీటికి 3 గ్రాములు కాపరఖ ఆక్సీ క్లోరైడ్, 0.1 గ్రామలు ప్లాంటామైసిన్ కలిపి పిచికారీ చేయాలన్నారు. పత్తిలో తొలిదశలో ఆశించే రసం పీల్చు పురుగుల నివారణ కోసం మోనోక్రోటాఫాస్ 1.6 మిగ్రాలు లేదా ఎసిఫిట్ 1.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి ఎస్‌కె వాజీద్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు వక్రీకరించారు

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సాజిద్‌ఖాన్



సీఎం, ఎమ్మెల్యే దిష్టిబొమ్మలను దహనం చేస్తున్న సాజిద్‌ఖాన్, నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను బీఆర్‌ఎస్ నాయకులు వక్రీకరించారని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో, ఆదిలాబాద్ రూరల్ మండలంలోని భీంసరి గ్రామంలో సీఎం కేసీఆర్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న దిష్టిబొమ్మలను ఉరితీసి దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేకనే బీఆర్‌ఎస్ నాయకులు అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అల్లూరి సంజీవ్‌రెడ్డి, సంజయ్, శ్రీకాంత్ రెడ్డి, గుడిపెల్లి నగేశ్, అంబకంటి అశోక్, రూపేష్ రెడ్డి, మధుకర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే ప్రజలకు సంక్షేమ పథకాలు



ప్రజలతో మాట్లాడుతున్న కంది శ్రీనివాస్‌రెడ్డి

బేల: కాంగ్రెస్‌తోనే ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి పథకాలు అందుతాయని కాంగ్రెస్ జిల్లా నాయకులు కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని జూనోని, వరూర్, చప్రాల, పిట‌గావ్ గ్రామాల్లో పర్యటించారు. ఇంటింటికీ తిరిగి కాంగ్రెస్ డిక్లరేషన్ గురించి వివరించారు. అర్హులకు పూర్తిస్థాయిలో రేషన్‌కార్డులు, ఆసరా పింఛన్‌లు ఇవ్వడంలో బీఆర్‌ఎస్ విఫలమైందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఫైజుల్లాఖాన్, మాజీ జెడ్పీటీసీ నాక్లే రాందాస్, వాంఖడే వామన్, నాగర్‌కార్ శంకర్, అఖిల్, మడావి చంద్రకాంత్ పాల్గొన్నారు.

‘హామీలు విస్మరించిన సీఎం కేసీఆర్’

తాంసి: ప్రజలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను సీఎం కేసీఆర్ విస్మరించారని టీపీసీసీ కార్యవర్గ సభ్యుడు వన్నెల అశోక్ ఆరోపించారు. శుక్రవారం మండల కేంద్రంలో తాంసి, భీంపూర్ మండలాల్లో గడప గడపకూ కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్ అధికారంలోని వస్తే అమలు చేసే డిక్లరేషన్ గురించి ప్రజలకు వివరించారు. కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కొడాల సంతోశ్, చిన్న రాంరెడ్డి, రాజు, గంగారెడ్డి, నారాయణ, రామన్న యాదవ్, వినోద్ రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా రవికిరణ్ యాదవ్ జన్మదిన వేడుకలు



కేక్‌కట్ చేస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: సాయి వైకుంఠ ట్రస్ట్ చైర్మన్, మాస్టర్స్ హోమియోపతి ఎండీ డాక్టర్ రవికిరణ్ యాదవ్ జన్మదిన వేడుకలను జిల్లా కేంద్రంలోని సాయివైకుంఠ ట్రస్ట్ భవనంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు కాడిగిరి రఘువీర్ యాదవ్ కేక్ చేసి సంబురాలు జరుపుకున్నారు. మహిళలు ఆర్థికంగా రాణించేలా కుట్టుమిషన్, ఎంబ్రైడరీ, మగ్గం వర్క్ అంశాల్లో ఉచితంగా శిక్షణ ఇస్తున్నారని కొనియాడారు. యాదవ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అసుర హనుమండ్లు యాదవ్, సురేందర్ యాదవ్, ట్రస్ట్ సభ్యులు రామన్న యాదవ్, నవీన్ యాదవ్, పురుషోత్తం యాదవ్, మహిళలు పాల్గొన్నారు.

తలమడుగు: డాక్టర్ రవికిరణ్ యాదవ్ సాయి వైకుంఠ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవలు అభినందనీయమని ఎంఈవో నారాయణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ఆయన జన్మదినాన్ని పురష్కరించుకొని విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం విద్యార్థులకు నోటుబుక్‌లు, పెన్నులు, పెన్సిలు పంపిణీ చేశారు. ఎంపీటీసీ చంటి, పద్మాకర్ రెడ్డి, వినోద్ రెడ్డి, వెంకట్ రమణ, సాయివైకుంఠ ట్రస్ట్ సభ్యులు జంగా ఆశన్న యాదవ్, మట్ట శ్రీనివాస్‌యాదవ్, నర్రా నవీన్ యాదవ్, కాడిగిరి రామన్నయాదవ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షిప్తం..

దర్గాలో ప్రత్యేక పూజలు

బోథ్: మండల కేంద్రంలోని కొత్త కాలనీలో ఉన్న ఇమామ్ దర్గా వద్ద సర్పంచ్ సురేందర్, కాలనీవాసులు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు పండాలని, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని మొక్కుకున్నారు. మాజీ ఎంపీటీసీ సత్యనారాయణ, లింగారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

నోట్‌బుక్స్ అందజేత

నేరడిగొండ: కుంటాల(కె) గ్రామ యువ నాయకుడు జాదవ్ సంతోశ్ శుక్రవారం గ్రామంలోని టీడబ్ల్యూఎంపీఎస్ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులను ఉచితంగా పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు గణేశ్, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చదవడం, రాయడం నేర్పించాలి

తలమడుగు: విద్యార్థులకు చదవడం, రాయడం నేర్పించాలని కాంప్లెక్స్ హెచ్‌ఎం వినోద్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కాంప్లెక్స్ పరిధిలోని రుయ్యాడి యూపీఎస్ పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో పాఠ్య పుస్తకాలు చదివిపించారు. ప్రతిఒక్కరూ పాఠ్య పుస్తకాలు చదివేలా వారిని తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం దిలీప్‌రెడ్డి, ఉపాధ్యాయులు లేనిన్ పాల్గొన్నారు.

నాలా తవ్వకం నిలిపివేయాలి

బేల: మండల కేంద్రంలోని సర్వే నంబరు 49/5/1 లో పది సంవత్సరాల క్రితం వేసిన లే అవుట్‌లోని 12 ప్లాట్లలో ప్రస్తుతం చేపట్టిన నాలా తవ్వకం నిలిపివేయాలని శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ ఇంద్రశేఖర్‌కు బాధితులు వినతిపత్రం అందజేశారు. తమ ప్లాట్లలో తవ్వకాలను నిలిపివేసి, మండల సర్వేయర్‌తో సర్వే చేయించాలని డిమాండ్ చేశారు. బాధితులు చౌదరి నామ్‌దేవ్, బుబన్ దశరథ్, తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

కైలాస్‌నగర్: జిల్లా ట్రెజరీశాఖ డీడీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన హారికను జిల్లా గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు రాజేందర్ దేశ్ పాండే, అనిల్ కుమార్, బాబూలాల్ రాథోడ్, రమేశ్ పాల్గొన్నారు.

క్విజ్ పోటీల పోస్టర్ ఆవిష్కరణ

ఇంద్రవెల్లి: ఖానాపూర్ నియోజవర్గంలో ఏఐసీసీ రీసెర్చ్ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర కోఆర్డినేటర్ వినోద్‌నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఇందిరమ్మ క్విజ్ పోటీల పోస్టర్‌ను శుక్రవారం హైదరాబాద్‌లో సీఎల్పీ నాయకుడు భట్టి విక్రమార్కతో కలిసి ఆవిష్కరించినట్లు వినోద్‌నాయక్ తెలిపాడు. క్విజ్ పోటీల్లో యువతి, యువకులు పాల్గొనాలని కోరారు.

మహిళల రక్షణ కోసమే షీటీం

నార్నూర్: మహిళల రక్షణ కోసమే షీటీం పని చేస్తుందని షీటీం సభ్యులు కమల, భాగ్యలక్ష్మిలు అన్నారు. శుక్రవారం గాదిగూడ మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ పాఠశాలలో బాలికలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో, పట్టణాల్లో మహిళలను ఎవరూ వేధించినా.. ఈవ్‌టీజింగ్‌కు పాల్పడినా 100కు డయల్ చేయాలన్నారు. మహిళల రక్షణ కోసం అనేక చట్టాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఎస్‌వో ప్రియాంక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మత్తుకు దూరంగా ఉండాలి

ఆదిలాబాద్‌టౌన్: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పొగాకు నియంత్రణ అధికారి శ్రీకాంత్ అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ పట్టణంలో స్మోకింగ్ జోన్‌లను తొలగిస్తూ అక్కడికి వచ్చిన యువతకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాలతో కలిగే నష్టాలను వివరించారు. నిత్యం ఆదిలాబాద్ పట్టణంతో పాటు ఆయా మండలాల్లో తనిఖీలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట వన్‌టౌన్ ఎస్సై అంజమ్మ, ఏఎస్సై దమన్, కానిస్టేబుల్ రాజేశ్ ఉన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ తొలగించాలి

బోథ్: మండలంలోని సొనాలలో ప్రాథమిక పాఠశాల పక్కన ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాలని కాలనీవాసులు కోరుతున్న పాఠశాల పక్కనే ఉండడంతో విద్యార్థులకు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళన చెందుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌కు కనీసం కంచె కూడా లేదని నవయువ మహాజన్ యూత్ అధ్యక్షుడు మంగళపెల్లి రాజశేఖర్ అన్నారు. వెంటనే ఇతర ప్రాంతానికి తరలించాలన్నారు.

బోథ్ మండలంలో అనిల్‌జాదవ్ పర్యటన

బోథ్: బోథ్ మండలంలో నేరడిగొండ జెడ్పీటీసీ అనిల్ జాదవ్ శుక్రవారం పర్యటించారు. మండలంలోని కుచులాపూర్ గ్రామంలో శబరిమాత ఆశ్రమాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బోథ్, ధన్నూర్(బి) గ్రామాల్లో గ్రామస్తులుతో మాట్లాడారు. అభివృద్ధి పనులపై చర్చించారు. గత కొన్ని రోజులుగా అనిల్ జాదవ్ బోథ్ మండలంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు.